ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

శనివారం 3 ఆగస్టు 2024

గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	551.30 (212.6510)	4,61,797	31,464
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.15 (3.73)	453.93	514.00
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.96 (1.13)	277	నిల్

చికెన్ ధరలు | లైవ్: రూ.135 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.240

అయిదేళ్లలో 35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు



జలకళ సంతరించుకున్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్

» దేశంలోనే ప్రగతిలో తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలుపుతాం : మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

» నాగార్జునసాగర్ ఎడమ, వరద కాల్వకు నీటి విడుదల

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలం అయిందని, నీటిని ముందస్తుగానే విడుదల చేయడం తమకు భగవంతుడిచ్చిన అవకాశంగా భావిస్తున్నామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని, రాబోయే మూడేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, గంధమల్ల రిజర్వాయర్, ఏఎమ్మార్పీ కాల్వల లైనింగ్ పనులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామన్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)/నాగార్జునసాగర్

'రాష్ట్రంలో రాబోయే అయిదేళ్లలో 35లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టిస్తాం. ప్రతిఏటా కొత్త ఆయకట్టు ఏర్పాటయ్యేలా పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తామని' మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రాజెక్టు ఎడమకాల్వకు, వరదకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ రంగం ధ్వంసమైందని ఆరోపించారు. రూ.1.80లక్షల కోట్ల అప్పులు చేసి కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ తదితర ప్రాజెక్టులు నిర్మిస్తే, కాళేశ్వరం కింద 95వేల ఎకరాల ఆయకట్టు చూపించినా ఆ ప్రాజెక్టు నాసిరకం కట్టడంతో కూలిపోయిందని విమర్శించారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టుల కింద ఒక్కటంటే ఒక్క ఎకరం కూడా కొత్త ఆయకట్టు రాలేదన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, కొత్త ప్రాజెక్టులు చేపట్టి రాబోయే అయిదేళ్లలో స్పష్టమైన లక్ష్యంతో నూతన ఆయకట్టును సృష్టించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళుతోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ కేటాయించని విధంగా ఈ బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.10,828 కోట్లు మూలధన వ్యయం కేటాయించామని, పెండింగ్ ప్రాజెక్టులన్నీ అత్యధిక ప్రాధాన్యం కింద గుర్తించి పనులు కొనసాగిస్తావన్నారు. రూ.లక్ష కోట్ల అప్పుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏ నిపుణుల కమిటీకి నివేదించినా, ఏ సంస్థ సూచించినా నాసిరకపు నిర్మాణం, నాణ్యత, నాసిరకపు పనులే చేసినట్లు తేలుతుందని, అప్పటి పాలకులు మాత్రం నిస్సిగ్గుగా తప్పుని ఒప్పుకోవడం లేదని దుయ్యబట్టారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలం అయిందని, నీటిని ముందస్తుగానే విడుదల చేయడం తమకు భగవంతుడిచ్చిన అవకాశంగా భావిస్తున్నామన్నారు.



కృష్ణమ్మకు వాయనం సమర్పిస్తున్న మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి

మూడు రోజుల్లో సాగర్ గేట్లు ఎత్తే అవకాశం

సాగర్‌కు ఎగువ నుంచి ఇలాగే వరద రాక కొనసాగితే మరో మూడు రోజుల్లో క్రస్ట్ గేట్లను ఎత్తే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 551.30 అడుగులుగా ఉంది. మరో 39 అడుగులకు చేరుకుంటే సాగర్ నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకుంటుంది. సాగర్‌కు రోజుకు ఎగువనుంచి 12అడుగుల చొప్పున నీరు వచ్చి చేరుతుంది. కాబట్టి మరో మూడు రోజుల్లో పూర్తి స్థాయికి చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి సామర్థ్యం 312.5050 టీఎంసీలు కాగా ప్రస్తుతం 212.6510 టీఎంసీలుగా ఉంది మరో 100 టీఎంసీల నీరు సాగర్‌కు వచ్చి చేరితే పూర్తి సామర్థ్యానికి చేరుకుంటుంది.

దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలుపుతాం: కోమటిరెడ్డి



రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలుపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ పథకాన్ని 1983లో అప్పటి మంత్రి జానారెడ్డి మం జూరు చేయించారని, ఆ తర్వాత వైఎస్ఆర్ హయాంలో పథకాన్ని చేపట్టి తమ హయాంలోనే సొరంగమార్గంలో 90శాతం పూర్తయిందని, మిగిలిన పదిశాతం పనులను పదేళ్లలో పూర్తిచేయలేదని విమర్శించారు. మళ్లీ ప్రజాప్రభుత్వంలో తాము ఈ పథకాన్ని మూడేళ్లలో పూర్తిచేసి ఏఎమ్మార్పీ, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీటిని అందించి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చే విషయమై మంత్రులు చొరవ తీసుకోవాలని కోరగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ గుర్తించి ఇచ్చే ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్‌రావు, డీఈలు శ్రీనివాస్, పరమేష్, జేఈలు కృష్ణయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక రూ.5,279.34కోట్లు

» ప్రాధాన్య రంగాలకు రూ. 4,513.09కోట్లు » ఇతర రంగాలకు రూ. 766.25కోట్లు
» రూ.3,636.27కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయింపు » సమీక్షలో కలెక్టర్



కలెక్టరేట్‌లో వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, ఆగస్టు 2: జిల్లా వార్షిక రుణ ప్రణాళిక రూ.5,279.34 కోట్లుగా రూపొందించినట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిధులు విడుదల చేసిన సందర్భంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.5,279.34కోట్ల రుణ ప్రణాళిక విడుదల చేశామన్నారు. ఇందులో ప్రాధాన్య రంగాలకు అత్యధికంగా రూ.4,513.09కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.766.25కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.3,636.27 కోట్లు, సూక్ష్మ,చిన్న, మధ్య తరహా వ్యాపార రంగాలకు రూ.762.29 కోట్లు, విద్యా రంగానికి రూ.17.55కోట్లు, గృహాల రుణాల కింద రూ.70.20కోట్లు, సామాజిక, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.76కోట్లు, పునరుత్పాదకశక్తి కింద రూ.15.02కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లా వార్షిక ప్రణాళికలో అత్యధికంగా వ్యవసాయ రంగానికి కేటాయించామన్నారు. బ్యాంకర్లు అర్హులైన ప్రతీ ఒక్కరికి సకాలంలో రుణాలు అందించాలన్నారు.

రుణాలు సకాలంలో అందించాలి

పంటల సాగుకు బ్యాంకుల్లో రుణాలు పొందాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. పీఎంఈజీ పీ, పీఎంఎఫ్ఎంఈ రుణాలు లబ్ధిదారులకు సకాలంలో అందించాలని, పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ రుణాలు సకాలంలో అందివ్వాలన్నా రు. మహిళలను ఆర్థిక శక్తిమంతులను చేయడమే మహిళా శక్తి పథకం ఉద్దేశమన్నారు. బ్యాంకుల్లో రుణ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధం గా స్వయం సహాయక సంఘాల రుణాలు సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమీక్షలో లీడ్ బ్యాంక్ మేనేజ ర్ శివరామకృష్ణ, వ్యవసాయ అధికారి అనురాధ, పరిశ్రమల అధికారి రవీందర్, ఆర్‌బీఐ ఏజీఎం గోమతి, నాబార్డ్ డీడీఎం సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈఈ జినుకల శ్యాం సుందర్, పశుసంవర్థక అధికారి డాక్టర్ కృష్ణ, బీసీ కులాల అభివృద్ధి అధికారి పి.యాద య్య, అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్యయనాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి

క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన అంశాలను ప్రజలకు ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ హనుమంతు కే. జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్‌కు చెందిన 24మంది అసిస్టెంట్ విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఎం.ఏ కృష్ణన్, జడ్పీ సీఈవో శోభారాణి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధి పి.వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్, ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి, సీపీవో జి.వెంకటేశ్వర్లు, అదనపు డీఆర్డీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందులు తొలగించేందుకే ప్రజాపాలన కేంద్రాలు: కలెక్టర్

భువనగిరి అర్బన్: వివిధ సమస్యలపై ప్రజల ఇబ్బందులు తొలగించేందుకే ప్రజాపాలన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రజాపాలన కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే మునిసిపల్ కేంద్రాలతోపాటు మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రాలు అందుబాటులో ఉండగా కలెక్టరేట్‌లో కూడా ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్‌లోని ప్రజాపాలన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డేటా సవరణకోసం వచ్చే దరఖాస్తుదారులు తమవెంట ఆధార్, రేషన్‌కార్డు, వంటగ్యాస్, మొబైల్, విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌వంటి నెంబర్లు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీవో జి.వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈఈ జినుకల శ్యాంసుందర్, బీసీ కులాల అభివృద్ధి అధికారి యాదయ్య, పశుసంవర్థక అధికారి డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.

బెటాలియన్ వద్దంటూ పోరుబాట

సంస్థాన్‌నారాయణపురంలో పోలీస్ బెటాలియన్ ఏర్పాటుపై కొంతకాలంగా రగడ నెలకొంది. బెటాలియన్ ఏర్పాటు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళన బాటపట్టడం, వారికి వామపక్షాలు, బీఆర్ఎస్ మద్దతు ప్రకటించడం మరింత ఉద్ధృతికి దారి తీసింది. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ బతుకుతున్న తమను రోడ్డున పడేయడం ఎంత వరకు సమంజసమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సంస్థాన్ నారాయణపురం



బెటాలియన్ ప్రతిపాదిత స్థలం

» సంస్థాన్‌లో పోలీస్ బెటాలియన్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు
» సాగు భూముల్లో ఏర్పాటును ఉపసంహరించుకోవాలంటున్న రైతులు
» ఆందోళన పట్టిన రైతులు.. మద్దతు పలికిన రాజకీయ పార్టీలు

సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రంలోని సర్వే నెం.255లో 144 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని 70ఏళ్ల క్రితం నుంచి భూమిలేని నిరుపేదలు, గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో కొంతమందికి అప్పటి ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు సైతం జారీ చేసింది. మరికొంత మందికి పాసుబుక్ కూడా వచ్చింది. మరికొంతమందికి మాత్రం పట్టా సర్టిఫికెట్లు మిగిలాయి. రాళ్లూ రప్పలుగా ఉన్న భూమిని రూ.లక్షలు ఖర్చుపెట్టి రైతులు అభివృద్ధి చేసుకున్నారు. మొత్తంగా సుమారు వందమంది రైతులు ప్రస్తుతం ఈ భూమిని నమ్ముకొని జీవిస్తున్నారు.

గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టడంతో సమస్య మరింత జటిలమైంది. గతంలో పాత పాస్‌బుక్‌లు కలిగి ఉన్న రైతులకు కొత్త పాస్‌పుస్తకాలను అందించకుండా నిలిపివేసింది. దశాబ్దాల కాలంగా భూములు సాగు చేసుకుంటున్న తమకు ప్రభుత్వం నూతన పాస్‌పుస్తకాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. భూములు సాగు చేసుకుంటున్న రైతులందరికీ నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించాలని గత ప్రభుత్వం నుంచి ప్రజాప్రతినిధులు అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందజేసి తమ గోడు వినిపించారు. అయినా నేటికీ రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి నోచలేదు.

పోలీస్ బెటాలియన్ ఏర్పాటు ప్రతిపాదన ?

హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మండలాల పరిధిలో పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖ భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం అవసరమైన స్థల సేకరణకోసం పోలీస్ శాఖ ప్రభుత్వానికి దరఖాస్తు చేసినట్లు అనధికారికంగా తెలుస్తోంది. బెటాలియన్ ఏర్పాటుకోసం అవసరమైన స్థలాన్ని సమకూర్చాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించినట్లు అనధికారిక సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలతో హైదరాబాద్‌కు 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములను పరిశీలించినట్లు సమాచారం. అందులో భాగంగా సంస్థాన్‌నారాయణపురంలోని సర్వే నెం.255లోని 144 ఎకరాల భూమి బెటాలియన్ ఏర్పాటుకు అనువుగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను స్థానిక అధికారులు ప్రభుత్వానికి నివేదించారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. 144 ఎకరాల భూమిలో ఇప్పటికే ప్రభుత్వం 11 ఎకరాలను సింగిల్ విండో గోదాం నిర్మాణం, సబ్ మార్కెట్‌యార్డ్‌కోసం కేటాయించింది. రెండున్నర ఎకరాల భూమిలో గాంధీనగర్ తండాకు చెందిన గిరిజనులు ఇల్లు కట్టుకొని నివాసముంటున్నారు. మిగతా భూమిని రైతులు సాగు చేసుకుంటున్నారు. సాగు చేసుకుంటున్న భూముల్లో పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని బాధిత రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనకు పలు సంఘాల మద్దతు

తమ భూములను రక్షించుకునేందుకు రైతులు చేపట్టిన ఆందోళనకు సీపీఐ, సీపీఎంలు మద్దతు పలికాయి. సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్, జూలకంటి రంగారెడ్డి తదితరులు బెటాలియన్ ప్రతిపాదిత భూములను సందర్శించారు. భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్ ప్రతిపాదన ఉపసంహరింపజేసేందుకు ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతుల ఆందోళనకు వామపక్షాలు మద్దతు ప్రకటించడంతో రైతులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. తమ భూముల్లో బెటాలియన్ ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని రైతులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం బెటాలియన్ ఏర్పాటు చేస్తుందా...? లేదా? రైతుల ఆందోళన దృష్టిలో ఉంచుకొని తమ ప్రతిపాదనలు ఉపసంహరించుకుంటుందా? వేచి చూడాల్సిందే.

బెటాలియన్ ఏర్పాటు ప్రతిపాదన రద్దు చేయాలి



సంస్థాన్‌నారాయణపురంలోని సర్వే నెం.255లో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన పోలీస్ బెటాలియన్ ఏర్పాటు ప్రతిపాదనలు తక్షణమే ఉపసంహరించుకోవాలి. రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో బెటాలియన్ ఏర్పాటు చేయడం సరి కాదు. సుమారు 70 ఏళ్లుగా భూమిని నమ్ముకుని జీవిస్తున్నాం. ఆ భూముల్లో ఇప్పుడు బెటాలియన్ ఏర్పాటు చేస్తే మేము బతికేది ఎలా. హైదరాబాద్‌కు చేరువలో సాగుకు పనికిరాని భూములు ఎన్నో ఉన్నాయని,అలాంటి భూముల్లో బెటాలియన్ ఏర్పాటు చేసుకోవాలి. ఈప్రతిపాదన విరమించుకోవాలి.
- చిలువేరు అంజయ్య, రైతు

సమాచారం అడిగితే వివరాలు పంపించాము



మండల కేంద్రంలోని సర్వే నెం.255కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉన్నతాధికారులు సమాచారం అడిగారు. అధికారుల ఆదేశాలమేరకు సర్వే నెంబర్‌కు సంబంధించి పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి సమాచారం వస్తే కాని పూర్తి విషయాలు తెలియవు.
- కృష్ణ, తహసీల్దార్, సంస్థాన్‌నారాయణపురం

పోరు బాట పట్టిన రైతులు

సంవత్సరాల తరబడి తాము సాగు చేసుకుంటున్న భూముల్లో ప్రభుత్వం పోలీస్ బెటాలియన్ ఏర్పాటుకు ప్రయత్నిస్తుందన్న విషయం తెలుసుకున్న సంబంధిత రైతులు తమ భూములను దక్కించుకునేందుకు పోరుబాటపట్టారు. సాగు భూముల్లో బెటాలియన్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు. తమ భూముల్లో బెటాలియన్ ఏర్పాటుచేస్తే తమ జీవనాధారం కరువైతుందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాతలు తండ్రుల కాలంనుంచి భూమిని దున్నుకొని బతుకుతున్నామని, ఇప్పుడు తమ భూములను ప్రభుత్వం తీసుకుంటే బతికేదెలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకు ఇటీవల మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా తమ భూములను రక్షించే విధంగా చూడాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్, జూలకంటి రంగారెడ్డి తదితరులకు రైతులు వినతిపత్రాలు అందజేశారు.



ప్రతిపాదిత భూములను పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ సమితి సభ్యులు

అనుమతులకు రెండోసారి నో

» ప్రభుత్వ వైద్య కళాశాలకు ఎల్‌వోపీ ఇవ్వని ఎన్ఎంసీ



భువనగిరి టౌన్, ఆగస్టు 2: దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్న చందంగా ఉన్నది జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు తీరు. ప్రతీ జిల్లాకు ఓ వైద్య కళాశాల అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకు వైద్య కళాశాలను మంజూరు చేసింది. ఈ మేరకు పలు అవాంతరాలు, చిక్కులు అధిగమిస్తూ భువనగిరిలోని పాత కలెక్టరేట్ భవనంలో వైద్యకళాశాల, జిల్లా ఆస్పత్రిని అనుబంధ బోధనాసుపత్రిగా గుర్తించి వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచి 50 సీట్లతో వైద్య కళాశాలను ప్రారంభించాలని నేటి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. కానీ వైద్య కళాశాల నిర్వహణకు సరిపడా అనుబంధ బోధనాసుపత్రి, ఫ్యాకల్టీ నియామకాలు లేవంటూ జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) కళాశాల ఏర్పాటుకు లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌వోపీ) ఇవ్వడానికి వరుసగా రెండోసారి తిరస్కరించింది. తాజాగా గురువారం రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో కళాశాలల ఏర్పాటుకు ఎల్‌వోపీ ఇచ్చిన ఎన్ఎంసీ యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు మరో మూడు జిల్లాలకు తిరస్కరించింది. అయితే తిరస్కరణకు గురైన మరో రెండు జిల్లాలకు త్వరలోనే ఎల్‌వోపీ రానున్నట్లు ప్రచారం జరుగుతుండగా యాదాద్రితోపాటు మరో జిల్లాకు ఈ విద్యాసంవత్సరానికి ఎల్‌వోపీ రావడం క్లిష్టతరంగా మారిందని అధికారులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

తనిఖీల్లో లోపాలే కారణమా?

ఎల్‌వోపీ రాకపోవడానికి ప్రధాన కారణం నిబంధనల మేరకు భువనగిరి జిల్లా ఆసుపత్రి సామర్థ్యం, పనితీరు, సరిపడా ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ నియామకాలు ఇటీవల వరకూ పూర్తి కాకపోవడాన్నే ఎన్ఎంసీ ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎన్ఎంసీ బృందాలు జూన్ 24న ప్రత్యక్షంగా, జూలై చివరన వర్చువల్ విధానంలో తనిఖీలు చేశాయి. మొదటి దఫా తనిఖీల్లో వెలుగుచూసిన లోపాలను సవరించుకుంటామని అప్పీల్‌కు వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వం రెండో దఫా తనిఖీల నాటికి కూడా సవరించలేక పోయినట్లు తెలుస్తోంది. ఈ కారణాలతోనే భువనగిరి వైద్యకళాశాలకు ఎల్‌వోపీ ఇవ్వడానికి ఎన్ఎంసీ నిరాకరించింది. వరుసగా రెండోసారి ఎల్‌వోపీ రాకపోవడం, ఎంబీబీఎస్ కౌన్సిలింగ్ షెడ్యూల్ వెలువడనుండటంతో వైద్య కళాశాల అనుమతులను సాధించడం రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో మొదటి, రెండో దఫా తనిఖీల్లో ఎన్ఎంసీ బృందాలు చూపిన లోపాలను సవరించి మరోమారు అప్పీల్‌కు వెళ్లేందుకు ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఇందుకు అనుగుణంగా శుక్రవారం భువనగిరి జిల్లాకేంద్ర ఆసుపత్రిలో రోజంతా అధికారుల సందడి నెలకొంది. ఈ విద్యాసంవత్సరం నుంచే వైద్య కళాశాలను ప్రారంభించి జిల్లా ప్రజలకు అంకితమిస్తామని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

త్రిదండి చినజీయర్ స్వామి



స్వర్ణగిరి ఆలయంలో వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న చినజీయర్ స్వామి

భువనగిరిరూరల్, ఆగస్టు2: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. భువనగిరి శివారులోని యాదాద్రి తిరుమల స్వర్ణగిరి క్షేత్రాన్ని శుక్రవారం మైహోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావుతో కలిసి సందర్శించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు జరిపారు. వేంకటేశ్వరస్వామికి సహస్ర నామార్చనగావించిన అనంతరం స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు నవకలశ ఆరాధనలు, అభిషేకాలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు. ఆలయ ఆవరణలో సహస్ర దీపాలంకరణ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు, ఛైర్మన్లు మానేపల్లి గోపికృష్ణ, మురళీకృష్ణ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోరుకున్న ఆలయానికి బదిలీకి రంగం?

భువనగిరి అర్బన్, ఆగస్టు 2: యాదగిరిగుట్ట ఆలయ ఉద్యోగులను కోరుకున్న ఆలయానికి బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ నెల 5వ తేదీ వరకు ఉత్తర్వులు జారీ అవుతాయని భావించగా, అంతకు ముందే శనివారం (3న) బదిలీల ఉత్తర్వులు అందనున్నట్లు సమాచారం. ఈ నెల 2న కమిషనర్ కార్యాలయానికి రావాల్సిందిగా ఆలయ ఉద్యోగులకు కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీకానున్న 25మంది ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కోరుకున్న ఆలయానికి బదిలీ చేసేందుకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిసింది. ఇక్కడి ఆలయ ఉద్యోగుల విషయంలో గత నెల 30న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శాసనసభలో చేసిన వ్యాఖ్యలు స్థానికంగా దుమారం రేపాయి. విపక్షాలు నిరసనలు, ధర్నాలు చేపట్టగా ఆలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వుల జారీపట్ల అనుమానాలు నెలకొన్నాయి. వీటన్నింటికీ తెరదించుతూ ఉత్తర్వులు జారీ కానున్నట్లు తెలుస్తోంది.

నిత్యం అప్రమత్తంగా ఉండాలి


రాచకొండ సీపీ సుధీర్‌బాబు



ట్రాఫిక్ పోలీసులను సన్మానించిన సుధీర్‌బాబు

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 2: ట్రాఫిక్ పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులను శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో సన్మానించి అభినందించారు. గత నెల 31న లక్కారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందగా.., భారీగా ట్రాఫిక్ నిలిచింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు ఎంతో శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించా రు. రోడ్డుపై బీరు సీసాలు పగిలిపోవడం, లారీ సామగ్రి, ఉల్లిపాయలు చిందరవందగా పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు స్వయంగా రంగంలోకి దిగి చీపుళ్ల పట్టుకొని రోడ్డును శుభ్రంచేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ట్రాఫిక్ పోలీసుల శ్రమను గుర్తించి సీపీ సుధీర్‌బాబు హైదరాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐ విజయ్‌మోహన్, సిబ్బంది ఉన్నారు.





రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం లోని టిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. తిరుమలగిరి పరిధి అనంతారం సమీపంలోని టిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్ యజమానులు గొడిశాల సోమన్న, రెడ్డిమల్ల ప్రభాకర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.




అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి

కట్టంగూరు, ఆగస్టు 2: అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ రాష్ట్రం సోనాముఖి జిల్లా బంకురా గ్రామానికి చెందిన దీబాస్ బౌరి(19) అనే వలస కార్మికుడు గత కొంత కాలం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి స్థానిక శ్రీ రాఘవేంద్ర ఫెర్రోఅలయస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన కడుపునొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కార్మికులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నొప్పి తగ్గకపోవడంతో శుక్రవారం నల్లగొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


యాదాద్రి జిల్లాలో 'వైఫ్‌స్వాపింగ్' కలకలం


భువనగిరి టౌన్, ఆగస్టు 2 : భార్యలను పరస్పర అంగీకారంతో ఇతరులతో పంచుకోవడం(వైఫ్‌స్వాపింగ్) యాదాద్రిభువనగిరి జిల్లాలో చర్చనీయాంశమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన రెండు జంటలు జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణ శివారులో అద్దె ఇళ్లలో ఉండేవారు. ఈ జంటలు పరస్పర అంగీకారంతో భార్యలను(వైఫ్ స్వాపింగ్) మార్చుకునేవారు. ఈ జంటలు తమ ఇళ్లకు సమీపంలో ఉత్తర భారతదేశ ప్రాంతానికి చెందిన ఓ కార్మికుడి కుటుంబాన్ని పరిచయం చేసుకుని తమ రొంపిలోకి లాగాయి. పరిస్థితులకు అనుగుణంగా ఆ మూడు ఇళ్లలోనే పగలురాత్రీ తేడా లేకుండా వైఫ్ స్వాపింగ్‌కు పాల్పడుతుండేవారు. ఈ క్రమంలో మూడు జంటల్లో ఓ వ్యక్తి తన భార్య చెల్లెలిని ఇందులోకి లాగాలని అందరినీ ఒప్పించాడు. అయితే ఆ కుట్ర తెలియని ఆమె ఇటీవల అక్క ఇంటికి వచ్చింది. అక్కాచెల్లెలు కలిసి కలిసి మరో జంట ఇంటికి వెళ్లారు. అయితే ఆ చెల్లెలు గతంలో మెడికల్ షాప్‌లో పనిచేసిన అనుభవంతో ఆ ఇంటిలో కనిపించిన మందులను ఎవరు వాడుతున్నారని ప్రశ్నించింది. దీంతో మేం వాడుతున్నామని ఆ ఇంటి ఇల్లాలు చెప్పింది. అనంతరం ఇంటికి వెళ్లాక ఆ జంట వాడుతున్నది సుఖవ్యాధులకు సంబంధించిన మందులుగా, నిర్లక్ష్యం చేస్తే హెచ్ఐవీగా రూపాంతరం చెందుతుందని, జాగ్రత్తగా ఉండాలని అక్కను హెచ్చరించి చెల్లెలు అదే రోజు ఊరికి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న రెండు జంటలు అద్దె ఇళ్లను ఖాళీ చేసి భువనగిరి విడిచివెళ్లాయి. మరో జంట కూడా త్వరలోనే సొంత ప్రదేశానికి వెళ్లి వైద్య చికిత్సలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.















సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నాం

బస్సులు ఆపాలని విద్యార్థుల ధర్నా ● గంటపాటు నిలిచిన వాహనాలు



మోటకొండూరు మండలం కాటేపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

మోటకొండూరు, ఆగస్టు 2: ఆర్టీసీ బస్సులు ఆపకపోవటంతో సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు రాస్తారోకో చేశారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. రాయగిరి-మోత్కూరు ప్రధానరహదారి వెంట ఉన్న కాటేపల్లి గ్రామానికి చెందిన 30మంది విద్యార్థులు భువనగిరిలో ఇంటర్, డిగ్రీ చదువుతున్నారు. కళాశాలలు ప్రారంభమై రెండునెలలుగా భువనగిరి వైపు వెళ్లే బస్సులు ఆపడంలేదని నిరసన వ్యక్తంచేస్తూ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సమయానుకూలంగా రెండు బస్సులు నడపడంతో పాటు, అన్ని బస్సులను కాటేపల్లి స్టేజీ వద్ద ఆపాలని డిమాండ్ చేశారు. గంటపాటు ధర్నాతో రెండువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్‌ను పోలీసులు ఫోన్‌లో సంప్రదించగా వారంలోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, విద్యార్థులు జువ్వగాని శ్రీరామ్, ఎండీ.అన్వర్, మల్లెల శ్రీహరి, సాయికుమార్, వరికుప్పల ఉమారాణి, వర్ష, సౌజన్య పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరి హత్య

- **అప్పు తీర్చలేక ఒంటరి మహిళ హత్య**
- **ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో పరార్**



జానకమ్మ(ఫైల్)

నార్కట్‌పల్లి, ఆగస్టు 2: తల్లి చేసిన అప్పు తీర్చలేక ఓ కుమారుడు ఒంటరి మహిళను కడతేర్చి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ క్రాంతికుమార్, గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణవెల్లెంలకు చెందిన రెబ్బ జానకమ్మ(72)కు చౌటుప్పల్‌కు చెందిన సత్తయ్యతో వివాహం కాగా, వారికి సంతానం లేదు. దీంతో సత్తయ్య రెండో వివాహం చేసుకుని చౌటుప్పల్‌లో ఉంటున్నాడు. ఇద్దరి మధ్య వివాదాల నేపథ్యంలో జానకమ్మ 33ఏళ్ల క్రితమే బ్రాహ్మణవెల్లెంలకు వచ్చి తల్లితో కలిసి అద్దె ఇంట్లో ఉంటోంది. భర్త సత్తయ్య ఐదేళ్ల క్రితం మృతిచెందగా, మూడేళ్ల క్రితం తల్లి మృతిచెందటంతో ఒంటరిగానే ఉంటోంది. జీవనోపాధి కోసం గ్రామంలో మగ్గాల వద్ద రంగులు అద్దే పనికి వెళుతూ ఉండేది. బ్రాహ్మణవెల్లెంలలో ప్రస్తుతం నివసిస్తున్న ఇంటినే కొనుగోలు చేసింది. తన కష్టంతో సంపాదించి దాచుకున్న డబ్బులను వడ్డీలకు ఇచ్చేది. ఇందులో భాగంగానే సుమారు లక్ష రూపాయలు ఇదే గ్రామానికి చెందిన కొలను రంగనాయకమ్మకు అప్పుగా ఇచ్చింది. రంగనాయకమ్మ కుమారుడు కార్తీక్ గ్రామంలోని మునుగోడు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు వద్ద కొన్నాళ్లపాటు హోటల్ నిర్వహించి ప్రస్తుతం సొంతంగా మగ్గం నడుపుతున్నాడు. తీసుకున్న అప్పు త్వరగా చెల్లించాలని జానకమ్మ రంగనాయకమ్మను తరచూ అడుగుతోంది.

హత్యచేసి ఆభరణాలతో పరార్..

ప్రతీ రోజూ ఉదయాన్నే నిద్ర లేచే జానకమ్మ 7 గంటలు దాటినా లేవకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న చెరుపల్లి ఆండాలు, జయసింహ వచ్చి తలుపుతట్టారు. ఆమె పిలిచినా పలకకపోవడంతో వేరే గుమ్మం వద్దకు వెళ్లగా ఆ సమయంలో రంగనాయకమ్మ కుమారుడు కొలను కార్తీక్ జానకమ్మ ఇంటి లోపలి నుంచి బయటకు వచ్చాడు. నువ్వెందుకు జానకమ్మ ఇంట్లోకి వచ్చావు.. జానకమ్మ ఏదని అడుగుతుండగానే ఆమె ఇంట్లో నిద్రిస్తోందని చెప్పి ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. వారు ఇంటి లోపలికి వెళ్లి చూసేసరికి జానకమ్మ విగతజీవిగా పడిఉంది. అప్పు తీర్చాల్సివస్తుందని ఆమెను హత్యచేసి ఆమె ఒంటిపై ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలను కూడా కార్తీక్ తీసుకుని పరారైనట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి సీఐ, ఎస్‌ఐలు నాగరాజు, క్రాంతికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రత్యక్ష సాక్షులను విచారించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతురాలు జానకమ్మ సవతి కుమారుడు రెబ్బ యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. నిందితుడిగా అనుమానిస్తున్న కార్తీక్ దిగా భావిస్తున్న హెల్మెట్‌ను పోలీసులు జానకమ్మ ఇంటి వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కార్తీక్ ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. త్వరలో నిందితుడిని పట్టుకుంటామన్నారు.

తండ్రి మరొకరితో సహజీవనం చేస్తున్నాడని..



కొండయ్య(ఫైల్)

గుర్రంపోడు, ఆగస్టు 2: తండ్రి మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆగ్రహించిన కుమారుడు రోకలిబండతో విచక్షణా రహితంగా కొట్టడంతో మృతిచెందాడు. గురువారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం చేపూరు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శివప్రసాద్, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం చేపూరు గ్రామానికి చెందిన అయితగోని కొండయ్య (62) వ్యవసాయ పనులతో పాటు సీజన్‌లో కల్లు గీసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొండయ్యకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు శంకర్‌కు వివాహంకాగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. తండ్రితోపాటే వ్యవసాయం చేసుకుంటూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొండయ్య భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన మరో మహిళతో కొద్ది కాలంగా సహజీవనం చేస్తున్నాడు. గురువారం ఆ మహిళకు సంబంధించిన పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కొండయ్యతో కుమారుడు అయితగోని శంకర్ గొడవపడ్డాడు. మహిళతో సహజీవనం చేస్తున్నావని, నిన్ను చంపుతానని బెదిరించాడు. దీంతో కొండయ్య సహజీవనం చేస్తున్న మహిళ ఇంటికి వెళ్లి భోజనం చేసి అక్కడే నిద్రించాడు. శంకర్ ఆగ్రహంతో ఆమె ఇంటికి వెళ్లి తండ్రితో గొడవపడి అక్కడున్న రోకలిబండతో విచక్షణారహితంగా కొట్టి పరారయ్యాడు. తీవ్రగాయాలైన కొండయ్యను చుట్టుపక్కల వారు 108లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కొండయ్య పెద్ద కుమార్తె పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నర్సయ్య(ఫైల్)

వలిగొండ, ఆగస్టు 2 : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సయ్యగూడెం వద్ద కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వల్లెపు నర్సయ్య(60) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం వలిగొండ మండలకేంద్రానికి మోపెడ్‌పై వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. నర్సయ్యగూడెం స్టేజీ దాటాక ఎదురుగా అజాగ్రత్తగా వచ్చిన కారు నర్సయ్య మోపెడ్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సయ్య కుమార్తె మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చండూరులో ఆటో బోల్తాపడి బాలుడు..



అనిల్(ఫైల్)

చండూరు, ఆగస్టు 2 : కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో బాలుడు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 12మంది కూలీలు బత్తాయిలు ఏరడానికి గుర్రంపోడు మండలం చామలోనిబావి గ్రామానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా చండూరు మునిసిపల్ కేంద్రంలో ఆటో బోల్తా పడింది. అయితే ఆటోలో నేరళ్లపల్లి గ్రామానికి చెందిన కదారి శ్రీను, నాగమ్మ దంపతులతో పాటు కుమారుడు అనిల్(15)లో ప్రయాణిస్తున్నాడు. ఈ ఘటనలో డ్రైవర్ పక్కనే కూర్చున్న కదారి అనిల్(15) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్‌తో పాటు మరో ఆరుగురికి తీవ్రగాయాలు కాగా నలుగురిని అంబులెన్స్‌లో నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరిని స్థానిక ఆసుపత్రిలో తరలించి చికిత్స అందించారు. మరికొంత మందికి స్వల్పగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కళ్ల ముందే కుమారుడు మృతి చెందడం, వారికి కూడా తీవ్రగాయాలుకావడంతో వారు స్పృహతప్పిపోయారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని ఆలగడప గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సైదులు(42) సొంతపని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. పని ముగించుకొని ఇంటికివెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కోదాడ - జడ్చర్ల రహదారిపై కారు అదుపుతప్పి ఢీకొట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. సైదులను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండజిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ సైదులు శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. సైదులు సోదరుడు సోమయ్య ఫిర్యాదుమేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వీరాంజనేయులుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

సహాయక చర్యల్లో పాల్గొని.. తీవ్ర గాయాలపాలై...

- **తాటిచెట్టుపై వృద్ధ గీత కార్మికుడి ఆత్మహత్య**
- **దింపే క్రమంలో ఓ వ్యక్తిపై పడిన మృతదేహం**
- **తీవ్రగాయాలతో వ్యక్తి ఆసుపత్రిపాలు**



చెట్టు సగం వరకు ఎక్కిన జూలూరి నాగరాజుపై పడుతున్న వెంకటేశం మృతదేహం

మునగాల, ఆగస్టు 2: సహాయకచర్యల్లో పాల్గొన్న ఓ వ్యక్తి 20అడుగుల ఎత్తునుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. శుక్రవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన దేశగాని వెంకటేశం(70) కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్యకు మతిస్థిమితం లేదు. వీరికి సంతానం లేకపోవడంతో మానసిక ఒత్తిడితో అనారోగ్యం పాలయ్యారు. కొద్దిరోజులు మానసిక ఒత్తిడితో ఉన్న వెంకటేశం శుక్రవారం మోకు ముస్తాద్‌తో తాటిచెట్టు ఎక్కి చెట్టు పైభాగాన బలమైన మట్టకు టవల్‌తో మెడకు కట్టుకుని మోకు ముస్తాద్‌లను కిందికి వదలడంతో మృతి చెందాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి బంధువులకు సమాచారం అందించడంతో వెంకటేశం మృతదేహాన్ని కిందికి దింపేందుకు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కీర్తి నర్సయ్య చెట్టు పైకి ఎక్కగా, మరో వ్యక్తి జూలూరి నాగరాజు చెట్టు సగం దూరం ఎక్కి ఉన్నాడు. ఈ క్రమంలో మృతదేహానికి ఉన్న తాడు తెగి మృతదేహం చెట్టు మధ్యలో ఉన్న నాగరాజు మీద పడింది. దీంతో 20 అడుగుల ఎత్తునుంచి నాగరాజు, మృతదేహం కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన నాగరాజును కోదాడ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. వెంకటేశం బంధువు దేశగాని నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి ఓ వ్యక్తి..

తిరుమలగిరి, ఆగస్టు 2 : క్రిమిసంహారక మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో జరిగింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన గిరిబాబు మునిసిపల్ కేంద్రంలోని సుప్రజ ఎస్టేట్‌లో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రియుడి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఘటన



అనిత(ఫైల్)

నకిరేకల్, ఆగస్టు 2: ప్రియుని వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన అనిత(28)కు నోముల గ్రామానికి చెందిన వెల్మకంటి శ్రీనుతో పదేళ్ల క్రితం వివాహంకాగా, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనిత కిరాణ దుకాణంతో పాటు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అదే గ్రామానికి చెందిన టేకుల రాజేష్‌తో సాన్నిహిత్యంగా ఉండటంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం గ్రామస్థులు ఇరువురిని మందలించి నచ్చజెప్పారు. కొద్దిరోజులుగా అనితకు రాజేష్ ఫోన్ చేసి వేధించడం మొదలు పెట్టాడు. మళ్లీ తన దగ్గరికి రావాలని తరచూ ఫోన్ చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న కొందరు పెద్ద మనుషులు రాజేష్‌ను మందలించారు. అయినా వినకుండా గురువారం రాత్రి మళ్లీ అనితకు ఫోన్ చేశాడు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషుల వద్దకు రావాలని వేధించడంతో మనస్తాపానికి గురైంది. అనిత ఇంట్లో తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహాన్ని రాజేష్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగటంతో ఎస్‌ఐ గోపికృష్ణ హుటాహుటిన వెళ్లి ఎలాంటి ఘర్షణ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజేష్ లేకపోవడంతో మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాత్రి 10 గంటల వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఈ విషయంపై సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఆయన తెలిపారు.

ఆండాళ్ అమ్మవారికి వైభవంగా ఊంజల్ సేవ



అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వయంభూలను మేల్కొలిపిన ఆచార్యులు పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీ దళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారిని అలకరించి సేవలో తీర్చిదిద్దారు. అనంతరం మంగళనీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీయాగం చేపట్టారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.10,24,087 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మాజీ ఉపప్రధానార్చకుడికి ఘనసన్మానం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఉపప్రధానార్చకుడిగా ఉద్యోగ విరమణ పొందిన పీ భాస్కరాచార్యులు దంపతులను ఘనంగా సన్మానించారు. ధన్వంతరి వేదికపై జరిగిన కార్యక్రమంలో వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త మాధవశేషస్వామి, కాటూరి శ్రీనుస్వామి, రామసీత, గట్టు నరసింహాచార్యులు, కేశవచార్యులు, అపోలో వెంకటాచార్యులు, మోటపల్లి గిరిస్వామి, రామాంజనేయచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో పెట్టి.. ఆభరణం కొట్టేసి..

సీసీ టీవీలో చూసి వెంటబడిన జ్యువెల్లరీ షాప్ యజమాని

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 2 : ఆటోలో వచ్చిన ఓ మహిళ బంగారు నగలు కొనుగోలు చేస్తున్నట్లు నటించి చోరీకి యత్నించింది. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బురఖా ధరించిన మహిళ భవాని జ్యువెలరీ షాపులోకి వెళ్లింది. ఆభరణాలు పరిశీలిస్తూ సేల్స్ ప్రమోటర్లను మాటల్లో పెట్టి బేరం ఆడింది. అప్పటికే దుకాణంలో వినియోగదారుల రద్దీ అధికంగా ఉండడంతో సేల్స్‌ప్రమోటర్లు బిజీగా ఉండడాన్ని గమనించిన మహిళ రెండు బంగారు ఆభరణాలను తస్కరించి ఆటోలో పారిపోయేందుకు ప్రయత్నించింది. మహిళ చోరీకి పాల్పడుతుండగా రికార్డైన సీసీ టీవీఫుటేజీని షాపు యాజమాని గుర్తించి కేకపెట్టాడు. దీంతో స్థానికులు ఆటోను అటకాయించారు. దీన్ని గమనించిన ఆటోడ్రైవర్ పారిపోగా, సదరు మహిళ స్థానికులకు చిక్కింది. అనంతరం జ్యువెలరీ షాపులోకి తీసుకెళ్లి ఆమెను తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభ్యం కావడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. నిందితురాలిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న సదరు మహిళ పట్టణంలోని సీతారాంపురం కాలనీ వాసిగా స్థానికులు తెలిపారు. కాగా ఈ సంఘటనపై విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నేరేడుచర్లలో పట్టపగలు చోరీ

నేరేడుచర్ల, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని పట్టపగలు చోరీజరిగింది. విద్యానగర్‌కు చెందిన రావిరాల భ్రమరాంబ శుక్రవారం మధ్యాహ్నం టాబ్లెట్లు తెచ్చుకునేందుకు ఇంటికి తాళం వేసి మిర్యాలగూడకు వెళ్లింది. తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా 36 తులాల వెండి, రూ.10వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించింది. డయల్-100 ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి వివరాలు సేకరించినట్లు ఆమె తెలిపింది.

దొంగల గుర్తింపు



పోలీసులు విడుదల చేసిన దొంగల చిత్రాలు

కోదాడ రూరల్, ఆగస్టు 2 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ గ్రామంలోని చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు గుర్తించారు. వారికి సంబంధించిన ఫొటోలను రూరల్ ఎస్‌ఐ అనిల్ రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కేఎల్ఆర్ కాలనీలో 45 రోజుల వ్యవధిలో ఐదు చోరీల్లో విలువైన వస్తువులు, డబ్బు, బంగారం అపహరణకు గురయ్యాయి. కాలనీ వాసులు ఫిర్యాదుతో విచారించిన పోలీసులు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను సీసీ కెమెరాలో గుర్తించామని, వారి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా వారి ఫొటోలను సేకరించి విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఇరువురు వ్యక్తులు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో దొంగతనాలు చేస్తున్నారని, ఎవరైనా వీరిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి కోరారు.

ఇరవై అడుగుల కొండచిలువ



చెరువులో ఊతకు చిక్కిన కొండచిలువ

అర్వపల్లి, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం అడివెంల గ్రామంలో చెరువులో ఊతతో చేపలు పడుతున్న వ్యక్తికి 20 అడుగుల కొండచిలువ లభించింది. శుక్రవారం గ్రామానికి చెందిన సైదులు ఊతతో చేపలు పడుతున్నాడు. ఒక్కసారిగా 20 అడుగుల కొండచిలువ ఊతలోకి పడడంతో సైదులు ఉలిక్కిపడ్డాడు. కొండచిలువను గట్టిగా పట్టుకొని గ్రామస్తులు బయటికి తీశారు. అప్పటికే ఊపిరాడక కొండచిలువ మృతి చెందింది. కొండచిలువను చూసేందుకు గ్రామస్థులు ఆసక్తి చూపారు.



వరదకాల్వ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

వరద కాల్వలో చెట్లను తొలగించాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 2: వరదకాల్వలో చెట్లను తొలగించి వెంటనే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని వరదకాల్వలో పేరుకపోయిన చెట్లను, ముళ్లకంపలను పరిశీలించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత వేసవికాలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా వరదకాల్వలో పేరుకపోయిన చెట్లను, ముళ్లకంపలను తొలగించి ఉంటే ప్రస్తుతం సాగర్ నుంచి వరదకాల్వలోకి నీరు త్వరగా చేరి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేదన్నారు. వరదకాల్వ కింద రైతులు పెద్దఎత్తున నారుమడులు పోసుకున్నారని, వెంటనే అధికారులు స్పందించి చెట్లను తొలగించి నీరు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దేవిరెడ్డి మల్లారెడ్డి, శ్రీను, శ్రీకర్, సీతారాంరెడ్డి, చంద్రయ్య, భూపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, నాగయ్య, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు వెళ్లేది ఎలా?

- ఇళ్లకన్నా ఎత్తులో మురుగుకాలువ
- కాలనీ వాసుల్లో ఆగ్రహం
- సమస్య పరిష్కరించని అధికారులు





జనావాసాలు లేనిచోట నిర్మించిన మురుగు కాలువ , ఇళ్లకన్నా ఎత్తులో ఉన్న కాలువ

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 2: చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 14 వ వార్డులో గల మారుతీ నగర్ కాలనీలో ఎలాంటి ఉపయోగం లేని మురుగు కాలువను నిర్మించడంపై కాలనీవాసుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇళ్లలోని మురుగు నీరు వెళ్లేందుకు అనువుగా లేకుండా నిర్మించిన ఈ మురుగు కాలువను తీవ్రంగా వ్యతిరేకించడంతో అర్ధాంతరంగా నిలిపివేశారు. అనాలోచితంగా నిర్మించిన మురుగు కాలువతో ప్రజా ధనం దుర్వినియోగం జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మారుతీ నగర్ కాలనీలో తంగడపల్లికి వెళ్లే ఆర్అండ్బీ రోడ్డు నుంచి ఊడుగు ఇస్తారి వ్యవసాయ బావి వైపు వెళ్లే దారిలో సుమారు 150 మీటర్ల పొడవున మురుగు కాలువను ఐదు మాసాల క్రితం నిర్మించారు. కానీ కాలనీ వాసులకు ఉపయోగకరంగా లేని మురుగు కాలువ నిర్మాణం పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో కాలువ పనులను అర్ధాంతరంగా నిలిపివేసి అధికారులు చేతులు దులుపుకున్నారు తప్ప ప్రత్యామ్నాయ ఏర్పాట్లను మాత్రం చేయలేక పోయారు. కాలనీవాసులకు మాత్రం మురుగు నీటి బాధలు రోజు రోజుకూ పెరుగుతున్నా మునిసిపల్ అధికారులు ఎంత మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇళ్ల వద్దే మురుగు నీటి నిల్వలు పేరుకుపోతుండడంతో ఒక వైపు దోమలు బెడద, మరోక వైపు దుర్వాసన ప్రబలుతుండడంతో కాలనీ వాసులు విషజ్వరాల బారిన పడుతున్నారు. కాలనీలో ఆందోళకర వాతావరణం నెలకొంది. ఇటీవల 10 రోజుల పాటు కురిసిన ముసురుకు మురుగు నీరు అధికమై కాలనీ వాసులు ఇబ్బందులుపడ్డారు.

ఇళ్ల బేస్మెంట్ కంటే ఎత్తులో

మారుతీ నగర్ కాలనీలోని ఇళ్ల బేస్మెంట్ కంటే దాదాపు రెండు నుంచి మూడు అడుగుల ఎత్తులో ఈ మురుగు కాలువను నిర్మించారు. భూమి పైన మూడు నుంచి నాలుగు అడుగుల మట్టి కట్టను వేయించి, మరీ ఈ మురుగు కాలువను నిర్మించారు. ఈ కాలువతో కాలనీ వాసులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోగా మరిన్ని సమస్యలను తెచ్చిపెట్టే విధంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ మురుగు కాలువను చూస్తుంటే ఒక చిన్న పాటి చెరువు కట్ట మాదిరిగా కనిపిస్తోంది. ఇళ్ల నుంచి బయటకు వెళ్లే మురుగు నీరు మూడు, నాలుగు అడుగుల ఎత్తులో ఉన్న మురుగు కాలువలోకి ఎలా వెళుతుందని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ధనంతో నిర్మించిన ఈ మురుగు కాలువతో తమకు ఎలాంటి ఉపయోగం లేక పోవడంతో కాలనీవాసులు మండి పడుతున్నారు.

ఉపయోగం లేని మురుగు కాలువను తొలగించాలి



మారుతీ నగర్కాలనీ వాసులకు ఉపయోగం లేని విధంగా నిర్మించిన మురుగు కాలువను తక్షణమే తొలగించాలి. కాలనీ వాసుల ఇళ్లకు అనువుగా ఉండే విధంగా కొత్తగా ఉత్తర భాగం వైపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ని నిర్మించాలి. ఇళ్ల బేస్మెంట్ కంటే రెండు, మూడు అడుగుల ఎత్తుతో ఫ్లై ఓవర్ మాదిరిగా మురుగు కాలువను నిర్మించి, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారు. మునిసిపల్ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో కాలనీ వాసులు మురుగు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

-బండారు నర్సింహ, సీపీఎం పట్టణ కార్యదర్శి, చౌటుప్పల్

కాలువ సమస్యను పరిష్కరిస్తాం



14వ వార్డులోని మారుతీనగర్లో నిర్మించిన మురుగు కాలువ సమస్య తమ దృష్టికి వచ్చింది. మురుగు కాలువను పరిశీలన చేసి, తగిన నిర్ణయం తీసుకుంటాం. కాలనీ వాసులతో చర్చించి మురుగు నీటి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. కాలనీవాసులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు.

-ఎన్.వెంకటేశ్వర నాయక్, కమిషనర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ

ప్రజా సమస్యలను పరిష్కరించాలి: సీపీఎం



మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 2: మునిసిపాలిటీలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.పాషా, పట్టణ కార్యదర్శి బండారు నర్సింహ డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో అధ్యయనం చేసిన సమస్యలపై శుక్రవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటికలు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మంచినీటి సరఫరాను మెరుగు పరచాలని కోరారు. అనంతరం కమిషనర్ ఎన్వీ.నాయక్కు వినతి పత్రం అందజేశారు. కౌన్సిలర్ జి.లక్ష్మణ్, నాయకులు గోశిక స్వామి, ఆకుల ధర్మయ్య, గోశిక కరుణాకర్, బత్తుల దాసు, వి.శ్రీనివాస్, పర్నే ధర్మారెడ్డి, కె.శివకుమార్, బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, చీకూరి ఈదయ్య, రాములు, యుగందర్ రెడ్డి, ఎర్ర ఊషయ్య, కాసీం పాల్గొన్నారు.

ఏఐఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గుండాలలో రైతుకు ట్రాక్టర్ను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

గుండాల, ఆగస్టు 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్రికల్చర్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్స్ పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ మద్దెల సుశాంత్ కోరారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీ వద్ద శుక్రవారం మర్రిపడగ గ్రామానికి చెందిన స్వామికి ఈ పథకం ద్వారా ట్రాక్టర్ మంజూరు కావడంతో ట్రాక్టర్ను అందజేశారు. ఈ పథకం ద్వారా రైతులు తక్కువ వడ్డీతో వ్యవసాయ ఇంజన్లు, పనిముట్లు, 9శాతం వడ్డీతో ఎలాంటి మార్టిగేజ్ లేకుండా ట్రాక్టర్ను తీసుకోవచ్చని మేనేజర్ తెలిపారు. 9శాతం వడ్డీలో రైతులకు తిరిగి 3శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఆర్పై అవగాహన ఉండాలి

వలిగొండ, ఆగస్టు 2: సీపీఆర్పై ప్రతీ ఒక్కరు అవగహన కలిగి ఉండాలని రెడ్క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ డైరెక్టర్ ఎస్కె.హమీద్ పాషా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అత్యవసర సమయంలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్, డాక్టర్ హేమంత్, మెడికల్ ఆఫీసర్ స్వర్ణలత, ఏఎన్ఎం శ్రీలక్ష్మీ అధ్యక్షులు స్వప్న, విజయ్, మురళీ, సురేష్ పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు

భువనగిరి రూరల్, ఆగస్టు 2: భువనగిరి మునిసిపాలిటీకి సరఫరా అవుతున్న కృష్ణాజలాల పైపులైన్ లీకేజీకి శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. చాలా కాలంగా ఈ సమస్య కొనసాగుతోంది. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామాంజులరెడ్డి, సిబ్బందితో పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టారు. అనంతరం మాజీ ఉప సర్పంచ్ విఠల్ వెంకటేష్ సమస్యను పలుమార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకుంది.

విజయమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు శ్రీనివాస్

తుర్కపల్లి, ఆగస్టు 2: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గందమల్ల రిజర్వాయర్ పై రాజకీయాలు చేయకుండా త్వరతగతిన పరిష్కారం చూపాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బానోతు శత్రునాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నాయకులు చిరిగె శ్రీనివాస్, యాట పెంటయ్య, మేకల శ్రీనివాస్, జక్కుల వెంకటేశ్యాదవ్, ఆకుల రమేశ్, ఆకుల సైదులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిసలు కావొద్దు: డీవైఎఫ్ఐ

వలిగొండ, ఆగస్టు 2: యువత డ్రగ్స్, గంజాయికి బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కవిడే సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో 'డ్రగ్స్ వద్దు మన ఆరోగ్యమే ముద్దు' అనే పోస్టర్ను ఎస్ఐ మహేందర్ ఆవిష్కరించారు. నాయకులు యాదగిరి, సలీం, మల్లేశం పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: యవత నిర్వీర్యం కాకుండా ఉండాలంటే డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాల్సిన అవసరం ఉందని ఎస్ఐ వెంకట శ్రీను అన్నారు. ఆలేరులోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాయకులు లోకేష్, భాస్కర్, నరేష్ ఉన్నారు.

ఉద్యోగుల బదిలీ అంశంపై విప్ జవాబు చెప్పాలి

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 2: ఉద్యోగుల బదిలీల అంశంపై కాంగ్రెస్ పార్టీ నాయకులను కాదని అసెంబ్లీలో మాట్లాడిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రజలకు జవాబు చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. శుక్రవారం గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ నాయకులు ఉలికిపడుతున్నారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం చంద్రంగౌడ్, ఎస్డీ.బాబా, దావూద్, రాజాలుగౌడ్, వీరేషం, క్రాంతి, యాకూబ్, మల్లేష్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం: కాంగ్రెస్ నాయకులు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తమని తేలిపోయిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుకల హేమేందర్ గౌడ్, గుండ్లపల్లి భరత్గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు నిజమైతే స్వామి వారి పాదాల చెంతకు వచ్చి ప్రమాణాలు చేయాలని చేసిన సవాల్ను స్వీకరించలేదని అన్నారు.

దివీస్ సేవలు సంతోషకరం

వలిగొండ, ఆగస్టు 2: గ్రామాల అభివృద్ధికి దివీస్ సంస్థ అందిస్తున్న సేవలు సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి కొనియాడారు. శుక్రవారం మండలలోని రెడ్లరేపాక గ్రామంలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ప్లాంట్ను ప్రాంభించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛమైన నీటిని తాగి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. వాటర్ప్లాంట్ను ఏర్పాటు చేసిన యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు ప్రకటించారు. కార్యక్రమంలో జహంగీర్, శంరయ్య, నర్సింహ, దివీస్ అధికారి సాయికృష్ణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



భువనగిరి మండలంలో డ్రైడే నిర్వహిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి-న్యూస్నెట్వర్క్: అంటువ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలి, పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. జిల్లాలోని పలుము మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో శుక్రవారం డ్రైగా పాటించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఇళ్లలోని నిల్వ నీటిని పారబోశారు, పలుచోట్ల మొక్కలు నాటారు. భువనగిరిలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామాంజులరెడ్డి, కౌన్సిలర్లు దిడ్డికాడి భగత్, బొర్ర రాకేష్, ఏతం కొండల్రావు ఉన్నారు. భువనగిరి మండలంలోని తాజ్పూర్, అనంతారం గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేశారు. ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, పంచాయతీ మండల అధికారి ఎం దినకర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి జినర్సింగ రావు ఉన్నారు.

- మోత్కూరులో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, డాక్టర్ నిరోష, అమరావతి, సైదమ్మ, నవనీత, జ్యోతి, పుష్ప, ఊర్మిళ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
- భూదాన్పోచంపల్లి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్ కుడికాల అఖిల బలరాం, అంగన్వాడీ, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.
- ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో నిర్వహిఆంచిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఎంపీడీవో రాములు నాయక్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, హెల్త్ సూపర్వైజర్ అజీజ్, ఏఎన్ఎం కృష్ణవేణి పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం



బస్వాపురంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఐఎన్ ప్రతినిధులు

ఆంధ్రజ్యోతి-న్యూస్నెట్వర్క్: తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ప్రతినిధులు (ఎన్ఐఎన్) సైల్వా, శ్రీదేవి అన్నారు. భువనగిరి మండలం బస్వాపురంలోని అంగన్వాడీ కేంద్రాన్ని వారు శుక్రవారం పరిశీలించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు అందుతున్న పోషకాలపై ఆరా తీశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ ఊర్మిల, డాక్టర్లు మౌనిక, పాండు, జడ్పీహైస్కూల్ హెచ్ఎం కృష్ణవేణి, సాహిదాబేగం, రేణుక ఉన్నారు.

- భువనగిరి పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రుల్లో జిల్లా సంక్షేమ అధికారి కేవీ.కృష్ణవేణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవోలు ఆర్.స్వరాజ్యం, ఎస్ శైలజ, జోత్న్స, ఏసీడీపీవో రమా పాల్గొన్నారు.
- గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో శిల్పిని, మండల వైద్యాధికారి డాక్టర్ హైమావతి, సూపర్వైజర్ కరుణ, వనజ, యాకూబ్ పాషాబేగం, అంగన్వాడీ టీచర్లు స్వర్ణ, ఆశావర్కర్లు కళమ్మ పాల్గొన్నారు.
- భూదాన్పోచంపల్లి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బి.శోభ, ఆర్.లత, జానకి, బి.శోభ, కె.మమత, సువర్ణ, పి.మమత, స్వరూప పాల్గొన్నారు.
- రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్కుమార్, అంగన్వాడీ సూపర్వైజర్ విజయలక్ష్మి, చంద్రకళ, భారతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.
- అడ్డగూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య, అంగన్వాడీ సూపర్వైజర్ మధురమ్మ, ఎంపీఓ ప్రేమలత, సూపర్వైజర్ శారద పాల్గొన్నారు.
- వలిగొండ మండలంలోని పొద్దుటూరులో అంగన్వాడీ అంగన్వాడీ టీచర్ సునీత, ఏఎన్ఎం ఆశ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 2: స్థానిక డిప్యూటీ తహసీల్దార్ నరసింహరావును తక్షణమే బదిలీ చేయాలని కోరుతూ మండలంలోని రామాజీపేటకు చెందిన దుర్గయ్య సీసీఎల్ఏ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

మోత్కూరు : వరంగల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల (జీజేసీ) ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఊర మత్స్యగిరి సిల్వర్ మెడల్ సాధించారు. కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్ ఆ విద్యార్థికి సిల్వర్ మెడల్ అందించి అభినందించారు.

మోత్కూరు : బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మలు దహనం చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మోత్కూరు సింగిల్విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు విమర్శించారు. మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు.

చౌటుప్పల్ టౌన్ : తంగడపల్లి జడ్పీహెచ్ఎస్లోని ఉపాధ్యాయులు మోటె సత్తయ్య, పి.రమాదేవి అదే పాఠశాలకు రూ.50వేల విలువైన ఫర్నిచర్, మూడు కుట్టు మిషన్లను మునిసిపల్ చైర్మన్ వెన్రెడ్డి రాజు అందజేశారు.

- చౌటుప్పల్లోని 14వ వార్డులోని ముత్యాలమ్మ దేవాలయానికి హనుమంతరావు దంపతులు రూ.10వేల విలువైన గేట్ను కమిటీ అధ్యక్షుడు సతీష్కు విరాళంగా అందజేశారు.

భువనగిరి రూరల్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పథకం అమలు జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు పచ్చిమట్ల శివరాజ్గౌడ్ అన్నారు. పట్టణంలో ఆయన మాట్లాడారు.

వలిగొండ: వలిగొండ పట్టణానికి చెందిన గంధమల్ల బాలయ్య తెలంగాణ ఉద్యమకారుల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ ఆయనకు నియమాకపత్రన్ని అందజేశారు.

ఆత్మకూరు(ఎం) : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

బొమ్మలరామారం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని సెక్రటేరియట్ ముట్టడిలో పాల్గొన్న తాజా మాజీ సర్పంచులను అరెస్టు చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్లు బీరప్ప, గణేష్, రామ్రెడ్డి, గోవింద్ అరెస్టు అయ్యారు.

ఆలేరు రూరల్: ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్గా పూజారి వెంకటేశ్లర్లుగౌడ్ బాధ్యతలను స్వీకరించారు.

రామన్నపేట: నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసూటికల్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కౌన్సిల్ (ఎన్ఐపిఇఆర్) సభ్యుడిగా ఎన్నికైన ఎంపీ చామల కిరణ్కుమార్రెడ్డిని వెల్లంకి గ్రామ మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్గౌడ్ హైదరాబాద్లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.

భువనగిరి టౌన్: వినియోగదారుల హక్కులు, సమస్యలు, పరిష్కారాలు తదితర అంశాలపై చర్చించే లక్ష్యంతో ఈ నెల 10, 11వ తేదీల్లో నాగార్జున సాగర్లో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలె వెంకటేశ్వర్లు తెలిపారు. భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అడ్డగూడూరు: మోత్కూరు ఎక్సైజ్ సీఐ రవిచంద్రారెడ్డి దాడి చేసి, తన చేతిలో ఉన్న కల్లులొట్టిని పగులగొట్టాడని మండలంలోని చౌళ్లరామారం గ్రామానికి చెందిన గీతకార్మికుడు అనంతుల దేవాంజిగౌడ్ న్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాగా ఎవరిపైనా దాడి చేయలేదని, లొట్టి పగులగొట్టలేదని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

శ్రీశైలంలో శివలింగాల నిమజ్జనం



మద్దెలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

భూదాన్పోచంపల్లి, ఆగస్టు 2: ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలతో భూదాన్పోచంపల్లి పుండరీక భక్త సేవాసమాజం ఆధ్వర్యంలో 501 పార్థీవ శివలింగాలను తయారుచేసి శ్రీశైల క్షేత్రంలో నిమజ్జనం చేసినట్లు సమాజం అధ్యక్షుడు చిట్టిమల్ల లక్ష్మీనారాయణ తెలిపారు. పుండరీక భక్త సేవా సమాజం ఆధ్వర్యంలో తయారు చేసిన పార్థీవ శివలింగాలకు భూదాన్పోచంపల్లిలోని మద్దెలమ్మదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల శివనామ సంకీర్తనలతో ఆలయం ప్రతిధ్వనించింది. అనంతరం శ్రీశైలం క్షేత్రంలో శుక్రవారం పార్థీవ లింగాలను నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో పుండరీక భక్తసేవాసమాజం అధ్యక్షుడు చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చిట్టిపోలు వసంత, సభ్యులు బిట్ల చంద్రనేత, ఆడెపు ఎల్లమ్మ, ఆడెపు జ్యోతి, ఇంజమూరి జానకిరాములు, మద్దెలమ్మదేవి ఆలయం అధ్యక్షుడు సూరపల్లి రాము, కడవేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిరక్షణపై అవగాహన ఉండాలి

రాజాపేట, ఆగస్టు 2: రైతులు తమ పంటలను రక్షించుకునేందుకు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని భారతీయ వరి పరిశోధన సంస్థ కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి కోరారు. మండలంలోని కుర్రారంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సేవస్ఫూర్తి ఫౌండేషన్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వరిలో మొగి పురుగు నివారణపై రైతులకు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. మొగి పురుగు నివారణపై లింగాకరక్ష బుట్టను రైతుల పొలాల్లో ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, మండల వ్యవసాయ అధికారి మాధవి, క్షేత్రీయ విస్తరణ అధికారి అంజయ్య, రైతులు నర్సిరెడ్డి, రాజిరెడ్డి, నరేందర్రెడ్డి, రమేష్, అనిల్, శ్రీను పాల్గొన్నారు

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

ఆలేరు రూరల్, ఆగస్టు 2: విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రవణ్కుమార్, శివప్రసాద్, మహేష్, బాబు ఉన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 2: ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.50ని రద్దు చేసి, చౌటుప్పల్ పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్గౌడ్, ప్రధాన కార్యదర్శి రాపోలు వేణుకుమార్ డిమాండ్ చేశారు. జీవో నెం.50ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట న్యాయవాదులు నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు తాడూరు పరమేష్, పి.మహిపాల్రెడ్డి, జల్లా రమేష్, ముత్యాల సత్తిరెడ్డి, బాల్యం వెంకటాచలపతి, స్వాతి ,జ్యోతి, చైతన్య, జక్కర్తి శేఖర్, బడుగు శ్రీకాంత్ పాల్గొన్నారు. కాగా ఇదే డిమాండ్తో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధేను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్ కలిశారు.

సుప్రీం తీర్పుతో ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం

- మందకృష్ణ, ప్రధాని మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

ఆంధ్రజ్యోతి-న్యూస్నెట్వర్క్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎస్సీ ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని పలువురు అన్నారు. తీర్పుపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పలు చోట్ల మంద కృష్ణమాదిగ, ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలు, ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు పలుచోట్ల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. సీఎం రేవంత్రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

- చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగిలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు బోయ లింగస్వామి, బోయ రాము, బోయ సంజీవ, నర్సింహ, యాదయ్య, బర్రె శంకరయ్య, కాకి జ్యోతిబస్, బోయ వెంకట్, చేకూరి బాబు, నిరంజన్ పాల్గొన్నారు.



మోత్కూరు: పాలడుగులో కృష్ణమాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- మోత్కూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొణతం నాగార్జునరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, కందుకూరి ప్రకాష్, గౌరు శ్రీనివాస్, మరాటి అంజయ్య, చేకూరి మల్లేష్, ముత్తినేని తిరుమలేష్, మామిడాల యాకేష్, ఎడ్ల రాము, దశరథ పాల్గొన్నారు. పాలడుగు, దత్తప్పగూడెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య, గుదే మధుసూదన్, కొంపెల్లి గోరయ్య, అంజయ్య, ప్రశాంత్, మహేష్, ముక్కెర్ల మల్లేష్, చింత చంద్రయ్య, తొంట నరేందర్, ముక్కెర్ల ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.
- వలిగొండలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పల్లెర్ల నర్సింహ, బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, అసెంబ్లీ కో కన్వీనర్ రాచకొండ కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి, నాయకులు మత్స్యగిరి వెంకటేశం పాల్గొన్నారు.
- ఆలేరు మండలంలోని శారాజీపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిలుకు కిష్టయ్య, రాంనర్సయ్య, శ్రీనివాస్ ఉన్నారు.
- భూదాన్పోచంపల్లి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాయేష్కుమార్, మండల అధ్యక్షుడు గుండ్ల రాజుయాదవ్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గంజి బసవలింగం, మాజీ సర్పంచ్ నోముల గణేష్, మేకల చొక్కారెడ్డి, గొలనుకొండ ప్రభాకర్, గోదాసు లింగస్వామి పాల్గొన్నారు.
- రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ, నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నల్ల శంకరయ్య, బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, మాజీ సర్పంచ్ కాటపల్లి యాదయ్య, నాయకులు శివగళ్ల ముత్యాలు, గర్దాసు రవీందర్, సింగనబోయిన జంగయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.
- రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు ఇంజ మహేష్, దొబ్బ రామకృష్ణ, దేవేందర్, జహంగీర్, కిషన్, ఎల్లయ్య, నవీన్, సురేష్ పాల్గొన్నారు.
- బొమ్మలరామారం మండల కేంద్రంలో దళిత సంఘాల జిల్లా నాయకుడు వేముల నరేష్ మాట్లాడారు. 30 సంవత్సరాల నుంచి పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణకు దళిత జాతి రుణపడి ఉంటుందని ఉంటుందన్నారు.

సీఎం రేవంత్రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరి టౌన్: ఎస్సీ వర్గీకరణను దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణలో అమలు చేస్తామని సీఎం రేవంత్రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, తంగెళ్లపల్లి రవికుమార్, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దర్గాయి హరిప్రసాద్ పాల్గొన్నారు.